## క్లుప్తంగా

### వర్షపునీరు రాకుండా చర్యలు

**మద్దికెర :** మండలంలోని మదనంతపురం గ్రామంలో వర్షపునీరు గ్రామంలోకి రాకుండా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హుసేన్ సాహెబ్, ఎంపీడీఓ నరసింహమూర్తి తెలిపారు. బుధవారం వర్షపునీరు గ్రామంలోకి వస్తున్నాయని, రాకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేయడంతో అధికారులు గ్రామానికి వెళ్లి పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి మట్టికట్ట నిర్మించామని త్వరలోనే శాశ్వత పరిష్కారం చేస్తామని చెప్పారు. ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, ఆర్ఐ రవికుమార్ ఉన్నారు.

### నాణ్యమైన భోజనం వడ్డించాలి

**తుగ్గలి :** విద్యార్థుల సంక్షేమంతో పాటు హాస్టళ్లలో ఆహార నాణ్యతను కచ్చితంగా పాటించాలని ఇన్‌చార్జ్ ఎంపీపీ ఎర్ర నాగప్ప ఆదేశించారు. బుధవారం రాతన సమీపంలోని ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ (బాలురు), బాలికల ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో తరగతి గదులు, వంటశాలను పరిశీలించారు. నాణ్యమైన ఆహారం విద్యార్థులకు అందించాలన్నారు. విద్యా ప్రమాణాలు పెంచడంతో పాటు పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. అంతకు ముందు తుగ్గలి గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు.

### మండల మీట్ వాయిదా

**వెల్దుర్తి:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. సమావేశానికి ముఖ్య అతిథిగా పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్ వచ్చారు. కోరం లేకపోవడంతో చేసేదేమీ లేక సర్వసభ్య సమావేశాన్ని రివ్యూ మీటింగ్‌గా మార్చుకున్నారు. ఎంపీడీఓ శివ మల్లేశ్వరప్ప ఆధ్యక్షతన జరిగిన సమావేశంలో మండలంలోని పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. వెల్దుర్తి మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, మహాత్మజ్యోతిరావు పూలే రెసిడెన్షియల్‌కు సొంత భవనాలు నిర్మించాలని సీపీఐ మండల కార్యదర్శి కృష్ణ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### మహిళలు ఆర్థికంగా స్థిరపడాలి



గూళ్యంలో ఎంబ్రాయిడింగ్ కుట్టు మిషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా

**ఆలూరు:** ఆర్థికంగా చితికిపోయిన మహిళలు మళ్లీ స్థిరపడేలా మండల, గ్రామ పొదుపు సంఘాల గ్రూపుల సభ్యులకు బ్యాంకు లింకేజీ ద్వారా కొత్త రుణాలను మంజూరు చేస్తున్నామని డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా తెలిపారు. బుధవారం హాలహర్వి మండలం గూళ్యం, హాలహర్వి, ఆలూరు మండల కేంద్రాల్లో పొదుపు గ్రూపు సభ్యులకు వివిధ బ్యాంకు లింకేజీ ద్వారా మంజూరు చేసిన రుణాలు, వాటి వినియోగం తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం ఆలూరులోని వెలుగు ఏరియా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తీసుకున్న రుణాలు వెంటనే చెల్లించాలని సూచించారు. అట్టడుగు వర్గాలకు చెందిన మహిళలకు వారి వృత్తితో నిమిత్తం లేకుండా రుణాలను మంజూరు చేయడం వల్ల కుటీర పరిశ్రమలను స్థాపించుకుని ఆర్థికంగా ఎదుగుతున్నారన్నారు. వెలుగు ఏరియా కోఆర్డినేటర్ నవీన్‌కుమార్ ఉన్నారు.

### వర్గీకరణ చంద్రబాబు కుట్రే

**ఆస్పరి:** రాజకీయ స్వలాభం కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎస్సీ వర్గీకరణకు కుట్ర చేశారని మాల మహానాడు సంఘం జిల్లా అధ్యక్షుడు గుడిసె మహానంది ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా భారత్ బంద్‌లో భాగంగా బుధవారం ఆస్పరిలో పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలను బంద్ చేయించారు. కొమ్ము రమేష్, భరత్, నరసప్ప, లక్ష్మన్న పాల్గొన్నారు.

### మౌలిక వసతులు కల్పించండి

**దేవనకొండ:** మండల కేంద్రం దేవనకొండలో మౌలిక వసతుల లోపం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఎం.నరసారావు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) నాగరాజునాయుడిని కలిసి వినతి పత్రం అందజేశారు.

### వ్యక్తి బలవన్మరణం

**వెల్దుర్తి:** మండలంలోని సూదేపల్లి గ్రామానికి చెందిన మాల ఆంజనేయులు(32) బుధవారం ఇంట్లో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు విచారణ చేపట్టారు.

### విద్యుదాఘాతంతో రైతు మృతి

**వెల్దుర్తి:** విద్యుదాఘాతానికి గురై ఓ రైతు, ఎద్దు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గోవర్ధనగిరి గ్రామంలో బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కలుగోట్ల మద్దయ్య(66), రోగమ్మ దంపతులకు ముగ్గురు కుమారులే, ఇద్దరు కుమార్తెలు సంతానం. వీరికి ఒక జత ఎద్దులు ఉన్నాయి. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించే వారు. కల్లంలో రేకుల కొట్టం వేసుకుని ఎద్దులను అక్కడే దిమ్మెకు కట్టేసేవాడు. బుధవారం తెల్లవారుజామున విద్యుత్ తీగ తెగి ఇనుప కంచె దిమ్మెపై పడటంతో షార్ట్‌సర్క్యూట్‌కు గురై ఎద్దు కుప్పకూలిపోయింది. దీనిని గమనించని మద్దయ్య పడిపోయిన ఎద్దును చూసేందుకు వెళ్లి కంచెను పట్టుకోగా షాక్ తగిలింది. ఈఘటనలో అతను అక్కడికక్కడే మృత్యువాత చెందాడు. తర్వాత మృతుడి కుమారుడు గమనించి విద్యుత్ సరఫరా నిలిపివేయించాడు. పోలీసులు, విద్యుత్, పశువైద్య అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

# అపార నష్టం

- రెండు రోజుల పాటు భారీ వర్షం
- కొట్టుకుపోయిన పంటలు, పొలం గట్లు
- చెరువులను తలపిస్తున్న పల్లెలు
- స్తంభించిన జనజీవనం
- బోరుమంటున్న అన్నదాత



నేమకల్లు వద్ద నీట మునిగిన కంది,వేరుశనగ పైరు

**హాలహర్వి:** మండలంలో మంగళవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి వరద ఉధృతి పోటెత్తింది. దీంతో రైతులు సాగుచేసిన మిరప, పత్తి, వరి తదితర పంటలను రైతులు కోల్పోయారు. పొలం గట్లు కొట్టుకుపోయాయి. పల్లెల్లో వర్షపునీరు నిలిచిపోవడంతో చెరువులను తలపిస్తున్నాయి. మండలలోని బల్లూరు, నిట్రవట్టి, హాలహర్వి, బాపురం, మల్లికార్జునపల్లి తదితర గ్రామాల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. తమను ఆదుకోవాలని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు.

**చిప్పగిరి:** మండలంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. మండల కేంద్రంతో పాటు బంటనహాలు, నేమకల్లు, గుమ్మనూరు, నగరడోణ, ఏరూరు, రామదుర్గం, బెల్డోణ, నంచర్ల తదితర గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది. భారీ వర్షాలనికి పత్తి, కొర్ర, సజ్జ, పత్తి, కంది తదితర పంటలు నీట మునిగాయి. మొత్తం మీద 78.5మి.మీ వర్షపాతం నమోదైందని అధికారులు బుధవారం తెలిపారు.



రామదుర్గంలో నీట మునిగిన పత్తి పైరు



నీట మునిగిన కొర్ర పంటను చూపుతున్న నగరడోణకు చెందిన రైతు కిష్టప్ప



హాలహర్వి వద్ద కోతకు గురైన పొలం



మల్లికార్జునపల్లెలో నిలిచిన వర్షపునీరు



పుటుకలమర్రి సమీపంలో వరదకు దెబ్బతిన్న పత్తి పంట

**ఆస్పరి:** పంటలు ఎదుగుతున్న సమయంలో హంద్రీ వాగు పొంగి పొర్లడంతో పంటలు పూర్తిగా దెబ్బతిని తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు, కౌలు రైతులు కోరుతున్నారు. సోమవారం రాత్రి మద్దికెర, హోసూరు, మొలగవల్లి, చిన్నహుల్తి గ్రామాల్లో భారీ వర్షం కురవడంతో ఒక్క సారిగా హంద్రీ వాగు పొంగి పొర్లింది. దీంతో వాగు సమీపంలో పంటలు సాగుచేసిన ముత్తుకూరు, పుటుకలమర్రి, వలగొండ, కైరుప్పల రైతులు తీవ్రంగా నష్టపోయారు. మూడు రోజులైనా పొలాల్లో వరద నీరు నిలిచి ఉంది. దీంతో పత్తి కాయలు పడిపోయి మొక్కలు కుళ్లిపోతాయని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు గ్రామాల్లో 1600 ఎకరాల్లో పత్తి, వేరుశనగ, ఉల్లి, సజ్జ, అముదం పంటలు నష్టపోయినట్లు ఏఓ నరేంద్ర కుమార్ తెలిపారు.

### రూ. 3లక్షలు నష్టపోయా



హంద్రీ వాగు సమీపంలో 7 ఎకరాలు కౌలుకు తీసుకని 5 ఎకరాల్లో పత్తి, 2 ఎకరాల్లో ఉల్లి పంటలు సాగు చేశా. కౌలు, పంటకు పెట్టుబడి కోసం రూ. 3లక్షలు అప్పు చేశా. వరదతో పత్తి, ఉల్లి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పంటలు చేతికొచ్చే ఆశలేదు. చేసిన అప్పు ఎలా తీర్చాలో తెలియడం లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

– లక్ష్మన్న, కౌలు రైతు, పుటుకలమర్రి

### పత్తి పంట నీట మునిగింది



నాకున్న రెండు ఎకరాల్లో రూ. 45వేలు పెట్టుబడి పెట్టి సాగు చేశా. పత్తి పైరు బాగా ఎదుగుతున్న సమయంలోహంద్రీ వాగు పొంగి పొర్లడంతో పంట పూర్తిగా దెబ్బతినింది. ప్రభుత్వం చేయూతనివ్వాలి. – లాలు, రైతు, పుటుకలమర్రి



ముత్తుకూరు వద్ద ఆముదం పంటలో మేట వేసిన బురద

## పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటాం



ఆస్పరి మండలం పుటుకలమర్రి సమీపంలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న జేసీ నవ్య

- ఆస్పరి, పత్తికొండ మండలాల్లో జేసీ నవ్య పర్యటన
- వరదలకు నష్టపోయిన పంటల పరిశీలన
- పంటనష్ట వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని ప్రకటన
- పత్తికొండ మండలంలో 307 హెక్టార్లలో పంటనష్టం

**అల్లగడ్డ(పత్తికొండ):** వర్షానికి పంటలు నష్టపోయిన రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని.. ప్రభుత్వం ఆదుకుంటుందని జాయింట్ కలెక్టర్ నవ్య రైతులకు భరోసా ఇచ్చారు. పత్తికొండ మండలంలో వర్షంతో దెబ్బతిన్న పంటలను బుధవారం పరిశీలించారు. మండలంలోని జూటూరు, చిన్నహుల్తి, పెద్దహుల్తి, నక్కలదొడ్డి గ్రామాల్లో పర్యటించి రైతులు, అధికారులతో మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ గ్రామాల వారిగా పంటనష్టం అంచానా వేశామన్నారు. మొత్తం 370 హెక్టార్లలో పంటలు దెబ్బతిని నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా వేశామన్నారు. ఇందులో 260 హెక్టార్లలో పత్తి, 90 హెక్టార్లలో వేరుశనగ, 107 హెక్టార్లలో కంది, 20 హెక్టార్లలో సజ్జ, 20 హెక్టార్లలో జొన్న పంటలు దెబ్బతిన్నాయని, నివేదికను ప్రభుత్వానికి పంపుతామన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు సహాయం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పంట నష్టం వివరాలు పక్కాగా నమోదు చేయాలని ఆదేశించారు. పత్తికొండ ఆర్డీఓ రామలక్ష్మీ, తహసీల్దార్ వెంకటలక్ష్మి ఉన్నారు.

**ఆస్పరి:** మండలంలోని ముత్తుకూరు, పుటుకలమర్రి, వలగొండ, కైరుప్పల గ్రామాల్లో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి హంద్రీ వాగు పొంగి పొర్లి సమీపంలోని పొలాల్లో వేసిన పత్తి, వేరుశనగ, టమాట, ఉల్లి, అముదం, సజ్జ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పుటుకలమర్రి సమీపంలో దెబ్బతిన్న పత్తి, ఉల్లి పంటలను జేసీ నవ్య బుధవారం పరిశీలించారు. ఆదుకోవాలని రైతులు జేసీని కోరారు. దెబ్బతిన్న పంటల వివరాలను జేసీ మండల అధికారులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ శివశంకర్‌నాయక్, ఆలూరు ఏడీఏ సునీత, ఏఓ నరేంద్రకుమార్, వీఆర్‌ఓలు ఉన్నారు.

## అక్రమ మద్యం పట్టివేత

**కృష్ణగిరి:** అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం ఆయన విలేకరులకు తెలియజేశారు. మండలంలోని కోయిలకొండ గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో ఉదయం సిబ్బందితో కలిసి దాడులు చేశామన్నారు. గ్రామానికి చెందిన వెంకటేష్ కుమారుడు చెన్నకృష్ణ వద్ద అదే గ్రామానికి చెందిన శిలబోయిని అంజనేయులు మద్యం తీసుకుని గ్రామ శివారులోని ఊర బావి వద్ద గల కంప చెట్ల వద్ద అమ్ముతుండగా దాడి చేసి కర్ణాటక రాష్ట్రానికి చెందిన 576 ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు, తెలంగాణ రాష్ట్రానికి చెందిన 42 నాకౌట్ హై పంచ్ స్ట్రాంగ్ బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు వివరించారు.



పట్టుబడిన మద్యం, నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

## శాంతించిన వేదావతి

**హొళగుంద:** ఆంధ్ర-కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులోని మార్లమడికి వద్ద ఉన్న వేదావతి (హగరి) నది బుధవారం శాంతించింది. దీంతో రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు పునః ప్రారంభమయ్యాయి. నది పరివాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షానికి రెండు రోజులుగా నది ఉధృతంగా ప్రవహించింది. దీంతో వరద నీరు వంతెనపై భారీగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. బళ్లారి, సిరుగుప్ప తదితర పట్టణాలకు రాకపోకలు నిలిచిపోయి ఇరు రాష్ట్రాలకు చెందిన ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో బుధవారం ఉదయం నుంచి రాకపోకలు మళ్లీ మొదలయ్యాయి. అయితే నదికి భారీగా వరద నీరు రావడంతో నది పరిసరాల్లో సాగైన పంటలు నీటి మునిగి దెబ్బతిన్నాయి.

### వర్షానికి కుంగిన కల్వర్టు

**తుగ్గలి :** మండల వ్యాప్తంగా రెండు రోజులుగా కురిసిన వర్షాలకు జొన్నగిరి నుంచి చిన్నజొన్నగిరి వెళ్లే దారిలో కల్వర్టు కుంగి పోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కాగా కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలకు వర్షపు నీరు చేరింది. పగిడిరాయి చెరువు మరువ పారగా, మిగిలిన చెరువులకు 70 శాతం పైగా నీరు చేరింది. వర్షాలకు మండలంలో పలు గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి.

### 11 మి.మీ వర్షపాతం నమోదు

**మద్దికెర :** మండలంలో రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో చెరువులు నీటితో కలకలలాడుతున్నాయి. మండలంలో బుధవారం 11 మి.మీ వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. స్థానిక మద్దమ్మ కుంట, పెరవలిలోని గోదాము కుంటల్లో నీరు చేరడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. భూగర్భ జలాలు పెరిగి బోర్లలో నీటిధార పెరుగుతుందని వారు పేర్కొంటున్నారు.



మార్లమడికి వద్ద నదిలో తగ్గిన వరద ఉధృతి



జొన్నగిరి వద్ద కుంగిన కల్వర్టు



మద్దికెరలోని మద్దమ్మ కుంట



పెరవలిలోని గోదాముకుంట

## గొడవలకు పాల్పడొద్దు



మల్లికార్జునపల్లిలో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ, తహసీల్దార్

**హాలహర్వి:** మండలంలోని మల్లికార్జునపల్లిలో ఇళ్లలోని నీరు వెళ్లకుండా కొందరు గొడవకు దిగడంతో బుధవారం సాయంత్రం హాలహర్వి తహసీల్దార్ నజ్మాబాను, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మి, ఆలూరు సీఐ శ్రీనివాసనాయక్ గ్రామానికి చేరుకున్నారు. స్థానికులతో మాట్లాడి సమస్యను సద్దుమణిగేలా చేశారు. తహసీల్దార్, సీఐ మాట్లాడుతూ ఇళ్లలోని నీరు ముందుకెళ్లకుండా కొందరు గొడవకు దిగారన్నారు. దీంతో వారితో మాట్లాడి జేసీబీతో మురుగునీరు వెళ్లేలా కాలువ తీయించారు. చిన్న చిన్న విషయాలకు ఘర్షణలకు పాల్పడరాదని, సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సీఐ ప్రజలకు సూచించారు. సర్పంచ్ లక్ష్మి, ఈఓపీ ఆర్డీ మల్లికార్జున, ఆలూరు ఎస్ఐ నరసింహులు, హాలహర్వి ఎస్ఐ నరేంద్ర, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## బాలిక కిడ్నాప్ కేసు ఛేదించిన పోలీసులు

- నిందితుడిపై పోక్సో కేసు.. రిమాండ్‌కు తరలింపు
- తల్లిదండ్రులకు బాలిక అప్పగింత



నిందితుడు కురువ రాఘవేంద్ర

**అల్లగడ్డ (పత్తికొండ):** రెండు నెలల క్రితం అదృశ్యమైన బాలిక కేసును పత్తికొండ పోలీసులు ఛేదించారు. కిడ్నాప్ చేసిన నిందితుడిని అరెస్ట్ చేసి పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌ను తరలించారు. బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. ఆ వివరాలను టౌన్ సీఐ జయన్న బుధవారం విలేకరులకు వెల్లడించారు. పత్తికొండలోని ఓ ప్రైవేటు స్కూల్ చదువుకుంటున్న బాలిక యథావిధిగా జూన్ 25న స్కూల్‌కు వెళ్లింది. సాయంత్రం ఇంటికి తిరిగి రాకపోవడంతో తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఆచూకీ లభించకపోవడంతో బాలిక తండ్రి పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాలికకు మాయమాటలు చెప్పి కిడ్నాప్‌కు పాల్పడింది పత్తికొండకు చెందిన 36 ఏళ్ల కురువ రాఘవేంద్ర అని గుర్తించి అతని సెల్‌ఫోన్ సిగ్నల్స్‌పై నిఘా పెట్టారు. మంగళవారం పత్తికొండకు చేరుకుని రహస్య ప్రదేశంలో ఉన్నట్లు గుర్తించి రాఘవేంద్రను అదుపులోకి తీసుకుని, బాలికను తల్లిదండ్రులకు అప్పగించామని సీఐ తెలిపారు.

## రైతులను ఆదుకోవాలి



దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

**దేవనకొండ:** హంద్రీ వాగు వరద వల్ల పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా నాయకులు శేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ హంద్రీవాగు వరద తో పొలాల్లో దాదాపు అడుగు నుంచి నాలుగు అడుగుల మేర నీరు ప్రవహించిందన్నారు. దీంతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ఇప్పటికీ పొలాల్లో నీరు నిలిచి ఉండటంతో పంటలు కుళ్లిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పత్తి కాపు దశలో ఉందని, కాయలు, పూత వరద ఉధృతికి రాలిపోయింద న్నారు. కంది, ఉల్లి, మిరప, వేరుశనగ, సజ్జ, జొన్న పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. వెంటనే వ్యవ సాయ అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకోవాలని కోరారు. బజారి, మండల కమిటీ సభ్యులు మహబూబ్‌బాషా, యూసుఫ్‌బాషా, ప్రజా సంఘాల నాయకులు సుధాకర్, రవి పాల్గొన్నారు.

**హాలహర్వి:** వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని అఖిల భారత రైతు మహాసభ సంఘం (ఏఐకేఎం) జిల్లా నాయకులు బోయ మునిస్వామి డిమాండ్ చేశారు. బుధవారం హాలహర్వి-బళ్లారి రహదారిపై రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల వల్ల హంద్రీ పరివాహక ప్రాంతాల్లో రైతుల పంటలు నీట మునిగి నష్టపోయారన్నారు. మండలంలో 2,300 ఎకరాల్లో పంటలు నీట మునిగాయన్నారు. పత్తికొండ, కొతాకోట, దేవనకొండ, హాలహర్వి, ఎమ్మిగనూరు, ఆస్పరి, చిప్పగిరి మండలాల్లోని రైతులు వేసిన వేలాది ఎకరాలు పంట నీటిలో మునిగిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు వీరేష గాదిలింగ, అంజి, హేమంత్, అన్నమయ్య, శివప్ప, చాకలి రమేష్, దర్గప్ప, నాగరాజు పాల్గొన్నారు.

### ఉపాధి పనుల ఆమోదానికి గ్రామసభలు

**ఆలూరు రూరల్:** ఉపాధి హామీ పనుల ఆమోదం కోసం అన్ని గ్రామ పంచాయతీలో శుక్రవారం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఆలూరు ఎంపీడీఓ అల్లబకష్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా గ్రామ సభలను విజయవంతం చేయాలన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి ఆ గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టాల్సిన పనులపై సమావేశంలో చర్చించాలని సూచించారు.

### ఈ క్రాప్ నమోదు పక్కాగా నిర్వహించాలి

**మద్దికెర :** ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటల నమోదు ప్రక్రియ పక్కాగా నిర్వహించాలని ఏఓ రవి సూచించారు. బుధవారం మద్దికెర తూర్పు పొలాల్లో చేపట్టిన పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. రైతులు తప్పనిసరిగా పంటలను నమోదు చేయించుకొని వ్యవసాయాధికారులకు సహకరించాలని కోరారు.

### విద్యార్థులకు కంటి పరీక్షలు

**తుగ్గలి :** స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆప్తాల్మిక్ అసిస్టెంట్ హనుమంతరెడ్డి విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 446 మందికి పరీక్షలు నిర్వహించగా అందులో 13 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. వీరికి త్వరలో కంటి అద్దాలు పంపిణీ చేస్తామని చెప్పారు.

### పత్తికొండ డీఎస్పీగా వెంకటరామయ్య

**తుగ్గలి (పత్తికొండ) :** పత్తికొండ డీఎస్పీగా బి.వెంకటరామయ్య నియమితులయ్యారు. ఇది వరకు ఇక్కడ పనిచేసిన డీఎస్పీ శ్రీనివాసరెడ్డి కర్నూలుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వెంకటరామయ్యను పోలీసు ఉన్నతాధికారులు నియమించారు.

### భాగవత సప్తాహ పఠనం

**మద్దికెర :** మండలంలోని వీరయ్యమఠంలో ఏడు

## సంక్షిప్తం

రాత్రులు, ఏడు పగళ్లు భాగవత సప్తాహ పఠన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. ఈనెల 17 నుంచి 24వ తేదీ వరకు భక్తి గీతాలు పాడటమే గాకుండా ప్రత్యేక పూజలు చేపడుతున్నామని చెప్పారు.

### ఓటరు నమోదు వేగవంతం చేయండి

**తుగ్గలి(పత్తికొండ) :** కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ నాగరాజు ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. కొత్త ఓట్ల నమోదు, పాత ఓటర్ల సవరణకు ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించిందన్నారు. బూత్ లెవెల్ ఆఫీసర్ (బీఎల్‌వో)లు ఇంటింటి సర్వే చేపట్టాలని సూచించారు. ఆర్ఐ సుధాకరరెడ్డి ఉన్నారు.

**హాలహర్వి:** ఓటర్లుగా నమోదు చేయించుకునేలా యువతను ప్రోత్సహించాలని తహసీల్దార్ నజ్మాబాను సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం బీఎల్‌వోలు, వీఆర్వోలతో సమావేశమై మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకుల ఓటర్ కార్డు కోసం దరఖాస్తులు చేసేలా ప్రోత్సహించాలన్నారు.

### పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలి

**మద్దికెర :** ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వేరుశనగ, పత్తి, మిరప పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏఓ రవి అన్నారు. బుధవారం రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వేరుశనగ, పత్తి పంటలో తెగుళ్ల నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు.

### ఇరువర్గాలపై కేసు నమోదు

**దేవనకొండ:** ఈనెల 15న స్థానిక కర్నూలు-బళ్లారి ప్రధాన రహదారిపై ఇరువర్గాలు పరస్పరం దాడులు చేసుకున్న ఘటనలో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ విజయభాస్కర్ బుధవారం విలేకరులకు తెలిపారు. కుంకనూరు గ్రామానికి చెందిన బీజేపీ మండల నాయకుడు బోడ రవికుమార్‌ను స్థానిక కర్నూలు-బళ్లారి రహదారిలో అదే గ్రామానికి చెందిన బండారి తిమ్మప్ప, తడకల లక్ష్మన్న, పరకల సోమన్న దాడి చేసి గాయపరచగా ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే.. బోడ రవికుమార్‌తో పాటు మరో ఇద్దరు తనపై దాడి చేశారని బండారి తిమ్మప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మొత్తం ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

### వర్షపు నీరు తొలగింపు



ఎం.కే పల్లిలో ప్రొక్లెయిన్‌తో కాలువలు తవ్వుతున్న దృశ్యం

**ఆలూరు:** రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం వల్ల వాగులు,వంకలు ఉప్పొంగి పార్లుతున్నాయి. హాలహర్వి మండలం ఎం.కే.పల్లి గ్రామంలో వరద నీటి వల్ల పలు కాలనీల్లోని ఇళ్లలోకి నీరు చేరింది. రెండు రోజుల నుంచి నీటిలోనే ప్రజలు కాలం వెళ్లదీశారు. కాలువలన్నీ పూడి పోవడంతో వరదనీరు వెళ్లే మార్గం లేకపోవడంతో నీరు ఇళ్లలోకి చేరింది. హాలహర్వి ఎస్ఐ నరేంద్ర, ఆలూరు సీఐ శ్రీనివాసనాయక్ బుధవారం సాయంత్రం గ్రామంలో పర్యటించి కాలువలు తవ్వించి నీరు వెళ్లే మార్గం చేయించారు.

### నూతన కమిటీ ఎన్నిక

**తుగ్గలి :** రైతు ఉత్పత్తి దారుల సంఘం మండల నూతన కమిటీని రైతులు బుధవారం ఎన్నుకున్నారు. స్థానిక సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడుగా సుబాష్‌చంద్ర బోస్, ఉపాధ్యక్షుడిగా దేవేంద్రయ్య, ట్రెజరర్‌గా గోపాల్, సెక్రటరీగా సరస్వతి, జాయింట్ సెక్రటరీగా జగదీష్‌నాయక్‌తో పాటు మరో 10 సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.